సాక్షి నిర్మల్

శనివారం, 8, జూలై, 2023



పోడు సాగును అడ్డుకున్న అధికారులు

ఖానాపూర్ మండలంలోని అడవి సారంగాపూర్ పంచాయతీ పరిధిలోని జిల్లెడుకుంటలోని పోడు భూముల్లో సేవ్యానాయక్ తండాకు చెందిన గిరిజనులు చేపట్టిన సాగును అటవీశాఖ అధికారులు అడ్డుకున్నారు.

8లో▸



ఆవిష్కరణలకు ఆహ్వానం

అవసరాల కోసం ప్రయోగాలు చేసే విద్యార్థుల తోపాటు అన్నివర్గాల వారిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం 'ఇంటింటా ఇన్నోవేటర్' కార్యక్రమం నిర్వహిస్తోంది.

8లో▸

గరిష్ఠం/కనిష్ఠం

31.5 /24.5

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. రుతుపవనాలు, ఉపరితల ఆవర్తనం కారణంగా చాలా ప్రాంతాల్లో వర్షం కురుస్తుంది.

న్యూస్‌రీల్

ట్రిపుల్ ఐటీ కౌన్సెలింగ్ షురూ..



విద్యార్థులతో డైరెక్టర్ సతీశ్‌కుమార్, అధ్యాపకులు

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీలో ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సులో పీయూసీ మొదటి సంవత్సరం ప్రవేశాలకు కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. వర్సిటీ ప్రాంగణంలోని అకడమిక్ విభాగంలో శుక్రవారం ఉదయం 9 గంటలకు విద్యార్థుల ధ్రువపత్రాల పరిశీలన ప్రారంభమైంది. 459 మంది విద్యార్థులు హాజరు కాగా 41 మంది గైర్హాజరయ్యారు. మొదటి రోజు 1 నుంచి 500 వరకు కౌన్సెలింగ్ నిర్వహించారు. బాసర గ్రామానికి చెందిన నానెం నవ్యకు మొదటి ఎంపిక ధ్రువపత్రాన్ని డైరెక్టర్ ప్రొఫెసర్ సతీశ్‌కుమార్ అందించారు. 24న క్యాంపస్‌లో రిపోర్ట్ చేయాలని, ఆగస్టు 1 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

ఆరోగ్య నివేదికలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో అమలు జరుగుతున్న వివిధ ఆరోగ్య కార్యక్రమాల నివేదికలన్నీ ఆన్‌లైన్ పోర్టల్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ ధనరాజ్ సూచించారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో జిల్లాలోని డేటా ఎంట్రీ ఆపరేటర్స్‌తో సమావేశం నిర్వహించారు. మాత శిశు సంరక్షణకు సంబంధించిన సేవలు, ఎన్సీడీ సేవలు, ఆయుష్మాన్ భారత్ నివేదికలు ఆన్‌లైన్ పోర్టల్‌లో ఎంట్రీ అయ్యేలా చూడాలని తెలిపారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రాజేందర్, కార్యక్రమ నిర్వాహణ అధికారి డాక్టర్ శ్రీనివాస్, డిప్యూటీ జిల్లా విస్తరణ మీడియా అధికారి రవీందర్, జిల్లా డాటా మేనేజర్లు గంగాధర్, ముత్యం పాల్గొన్నారు.


అడెల్లి ఆలయ పనులు పరిశీలించిన అధికారులు



పనులు పరిశీలిస్తున్న ఇంజినీరింగ్ అధికారులు

సారంగపూర్: మండలంలోని అడెల్లి మహాపోచమ్మ ఆలయ పునర్నిర్మాణ పనులను దేవాదాయ శాఖ, పంచాయతీరాజ్ చీఫ్ ఇంజినీర్ సీతారాములు, దేవాదాయ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కనకదుర్గా ప్రసాద్ శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆలయ నిర్మాణ పనులు చేపడుతున్న కాంట్రాక్టర్‌తో మాట్లాడారు. పనులను పూర్తి నాణ్యతతో చేపట్టాలని సూచించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు శ్రీనివాసశర్మ వారికి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ రెనోవేషన్ కమిటీ చైర్మన్ ఆయిటి చందు, ఆలయ ఈవో రవికిషన్‌గౌడ్, సీనియర్ అసిస్టెంట్ రమణారావులు అధికారులను ఘనంగా సత్కరించి అమ్మవారి ఫొటోలు అందజేశారు. డీఈ ప్రభాకర్, ఏఈ రామారావు పాల్గొన్నారు.

పోలీసులకు వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న ఆర్‌ఎంవో

నిర్మల్‌చైన్‌గేట్: పోలీస్ కానిస్టేబుళ్లకు ప్రమోషన్ ట్రైనింగ్ కోసం ఆర్‌ఎంవో డాక్టర్ వేణుగోపాలకృష్ణ జిల్లా ఆసుపత్రిలో శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. రక్త పరీక్షలు, శరీరదారుఢ్య పరీక్షలు నిర్వహించి పరీక్ష పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో హాస్పిటల్ సూపరింటెండెంట్ దేవేందర్‌రెడ్డి, ఆర్ఎస్సై శ్రీనివాస్, ఆర్‌పీసీ శ్రీకాంత్, డాక్టర్ రత్నాకర్, నర్సింగ్ సూపరింటెండెంట్ భారతి, హెడ్ నర్స్ శోభ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలికి షోకాజ్ నోటీస్

నిర్మల్ రూరల్: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ఓ విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయురాలికి షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు డీఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు. పాఠశాలలో 5వ తరగతి చదివే విద్యార్థి తలపై ఉపాధ్యాయురాలు విమల కొట్టి గాయపర్చింది. తల్లిదండ్రులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో సదరు ఉపాధ్యాయురాలికి 24 గంటల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించారు.

జలాశయాలు ఖాళీ!



ఎస్సారెస్పీ ప్రాజెక్టు

- భారీ వర్షాలు లేక.. వరద రాక..
- డెడ్ స్టోరేజీలో జిల్లా ప్రాజెక్టులు
- ఆయకట్టు రైతుల్లో ఆందోళన
- నార్లు పోయని రైతులు.. ముందుకు సాగని ఎవుసం

భైంసా: ఈ ఏడాది రుతుపవనాలు ఆలస్యంగా రాష్ట్రంలోకి ప్రవేశించాయి. పక్షం రోజులు దాటినా చిరు జల్లులు మినహా ఇప్పటి వరకు భారీ వర్షాల జాడలేదు. దీంతో జిల్లాలోని జలాశయాల్లోకి చుక్క నీరు చేరలేదు. దీంతో ఆయకట్టు రైతులు ఇప్పటికీ నార్లు పోసుకోలేదు. మహారాష్ట్రలో బాబ్లీ ప్రాజెక్టు గేట్లు ఎత్తినా గోదావరి నదిలో వరద ఉధృతి కనిపించలేదు. మహారాష్ట్రలోనూ వర్షాలు కురియడంలేదు. ప్రస్తుతం బాబ్లీ ప్రాజెక్టు వద్ద కూడా అంతగానీరు లేదు. దీంతో రైతులు భారీ వర్షాల కోసం ఆకాశం వైపు ఆశగా చూస్తున్నారు. నిత్యం మేఘాలు కమ్ముకొస్తున్నా.. అవి వర్షించకుండానే కరిగిపోతున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాలో ప్రాజెక్టుల పరిస్థితి ఇలా ఉంది. గతేడాది జూలై 20 నాటికి జిల్లాలోని ప్రాజెక్టులన్నీ నిండాయి. ఈ ఏడాది ప్రవాహం మొదలు కాకపోవడమే రైతులను ఆందోళనకు గురిచేస్తోంది.

ఎస్సారెస్పీలోనూ...

ఉత్తర తెలంగాణ వరప్రదాయినిగా చెప్పుకునే శ్రీరాంసాగర్ ప్రాజెక్టు (ఎస్సారెస్పీ)లోనూ ఇప్పటి వరకు వరద నీరుచేరలేదు. గోదావరి నది వరద నీటితో పోటెత్తితేనే ఈప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండుతుంది. 90.3 టీఎంసీల సామర్థ్యం ఉన్న ఈ ప్రాజెక్టులో ప్రస్తుతం 20.726 టీఎంసీల నీరు ఉంది. మరోవైపు మహారాష్ట్రలోని బాబ్లీ ప్రాజెక్టు గేట్లు ఎత్తారు. మహారాష్ట్రవైపు నుంచి వచ్చే గోదావరి నదిలో ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో వరద ఉధృతి కనిపించలేదు. ఎస్సారెస్పీ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండితే బాసర వరకు ఉండే బ్యాక్ వాటర్ నుంచి ఎత్తిపోతల పథకాలతో అటు నిజామాబాద్... ఇటు నిర్మల్ జిల్లా రైతులు వరి సాగుచేస్తారు.

స్వర్ణ ప్రాజెక్టు...


సారంగాపూర్ మండలంలోని స్వర్ణ ప్రాజెక్టు ఆయకట్టు 10 వేల ఎకరాలు. ఆరు గేట్లతో నిర్మించిన ఈ జలాశయానికి మధ్య కాలువ షెట్టరుకు రూ.5 లక్షలతో ఈ మరమ్మతు చేశారు. మరమ్మతు పనులు చేసే ముందే ప్రాజెక్టులోని నీళ్లన్నీ వదిలేశారు. ప్రస్తుతం మరమ్మతు పనులు చివరి దశలో ఉన్నాయి. ప్రాజెక్టు సామర్థ్యం 14.8 టీఎంసీలు, ప్రస్తుతం డెడ్ స్టోరేజీలోనే కనిపిస్తుంది. మధ్య కాలువ షెట్టర్ ద్వారానే 6 వేల ఎకరాలు సాగవుతుంది.



స్వర్ణ ప్రాజెక్టు

గడ్డెన్న వాగు..

భైంసా పట్టణ సమీపంలో ఉన్న గడ్డెన్నవాగు ప్రాజెక్టు 8 గేట్లతో నిర్మించారు. 1.852 టీఎంసీల సామర్థ్యం ఉన్న ఈ ప్రాజెక్టులో ప్రస్తుతం 0.849 టీఎంసీల నీరు ఉంది. ఈ ప్రాజెక్టు కింద 13,950 ఎకరాలకు సాగునీరు అందుతుంది. మహారాష్ట్రలో వర్షాలు కురిస్తే వచ్చే వరద నీటితోనే ఈ ప్రాజెక్టు నిండుతుంది. ఇప్పటి వరకైతే ప్రాజెక్టులోకి చుక్క నీరు కూడా రాలేదు. ఈ ప్రాజెక్టు నుంచే భైంసా పట్టణంతోపాటు డివిజన్ ప్రజలకు మిషన్ భగీరథ పథకంతో తాగునీటిని అందిస్తున్నారు.



గడ్డెన్నవాగు ప్రాజెక్టు

కడెం ప్రాజెక్టు...



జిల్లాలో ప్రధాన ప్రాజెక్టు కడెం జలాశయం. గతేడాది కురిసిన భారీ వర్షాలతో దెబ్బతిన్న ప్రాజెక్టుకు మరమ్మతులు కొనసాగుతున్నాయి. 18 గేట్లతో నిర్మించిన ఈ ప్రాజెక్టు సామర్థ్యం 7.603 టీఎంసీలు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టులో 2.951 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఈ ప్రాజెక్టు కింద 68 వేల ఎకరాల సాగునీరు అందుతుంది. ఇప్పటికీ ప్రాజెక్టు గేట్లు మరమ్మతు పనులు జరుగుతున్నాయి. భారీ వర్షాలు కురవకపోవడంతో ఈ ప్రాజెక్టులోనూ నీరు చేరలేదు.

సదర్‌మాట్ ప్రాజెక్టు...

ఎస్సారెస్పీ గేట్లు ఎత్తితే వచ్చే నీటితో కాలువ ద్వారా వచ్చే నీటిపై సదర్‌మాట్ ప్రాజెక్టు ద్వారా ఖానాపూర్ మండలంలో 13 వేల ఎకరాలకు నీరు ఇస్తున్నారు. గోదావరి నదిపై మామడ మండలం పొన్కల్ వద్ద రూ.500 కోట్లు వెచ్చించి సదర్‌మాట్ రెండో బ్యారేజీ నిర్మిస్తున్నారు. 1.5 టీఎంసీల నీటి నిల్వతో ఈ బ్యారేజీ నిర్మాణం జరుగుతుంది. వర్షాలు కురవక.. ఎస్సారెస్పీ గేట్లు ఎత్తకపోవడంతో నీరు రాలేదు. సదర్‌మాట్ అధికారులు సైతం ఖరీఫ్‌కు నీటి విడుదలపై ఎలాంటి ప్రకటన చేయలేదు.

భారీ వర్షాలు కురిస్తేనే జిల్లాలో ప్రధాన ప్రాజెక్టులు నిండి ఆయకట్టుకు సాగునీరందుతుంది. వర్షాకాలం ప్రారంభమైన భారీ వర్షాలు లేక రైతులు ఆందోళన చెందుతున్నారు.

భూ సమస్యలు త్వరగా పరిష్కరించాలి

- రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ వరుణ్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: భూ సమస్యల పరిష్కారానికి ధరణిలో కొత్త ఆప్షన్లు అందుబాటులోకి తెచ్చినట్లు రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ తెలిపారు. కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు, తహసీల్దార్లతో హైదరాబాద్ నుంచి శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జీవో 58, 59, 76, 118 కింద భూముల క్రమబద్ధీకరణ, ధరణి పెండింగ్ దరఖాస్తులు, ధరణిలో నూతన ఆప్షన్లపై సమీక్షించారు. జీవో 59 కింద గతంలో వచ్చిన దరఖాస్తుల్లో కొందరు దరఖాస్తుదారులు ఇప్పటి వరకు చెల్లింపులు ప్రారంభించలేదని, వెంటనే వారికి నోటీసులు జారీ చేసి చెల్లింపుచేసేలా చూడాలన్నారు. జీవో 59 కింద లక్షలోపు చెల్లించాల్సిన దరఖాస్తుదారులకు సైతం నోటీసు అందించి త్వరితగతిన చెల్లింపు చేసేలా అవగాహన కల్పించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న పట్టాల పంపిణీ రెండు రోజుల్లో పూర్తి చేయాలన్నారు. భూముల క్రమబద్ధీకరణ కటాఫ్ తేదీని 2020, జూన్ 2వ తేదీ వరకు పొడిగిస్తూ జీవో 58, 59 ,76 కింద ప్రభుత్వం మరో మారు దరఖాస్తులను స్వీకరించిందన్నారు. వీటిని క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టేందుకు బృందాలను ఏర్పాటు చేసి నెలరోజుల్లో అర్హులను ఎంపిక చేయాలన్నారు. జీవో 118 కింద పెండింగ్ ఉన్న దరఖాస్తులు 15 రోజుల పూర్తి చేయాలని సూచించారు.

ధరణిలో కొత్తగా ఐదు ఆప్షన్లు..

ధరణి కింద పెండింగ్ ఉన్న దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని నవీన్ మిట్టల్ సూచించారు. భూసమస్యల పరిష్కారం కోసం ధరణిలో కొత్తగా ఐదు ఆప్షన్లు అందుబాటులోకి తెచ్చామన్నారు. ధరణి సేవలను విస్తృతం చేయడంతోపాటు చిన్న చిన్న లోపాలను సవరిస్తున్నట్లు తెలిపారు. ధరణిలో చేరిన నకిలీ సర్వే నంబర్లు, డబుల్ సర్వే నంబర్లు పరిష్కరించేందుకు తహసీల్దార్లకు ఆప్షన్ ఇచ్చామన్నారు. కంపెనీలకు మంజూరు చేసిన పట్టాదారు పాసుపుస్తకాలలో తప్పులుంటే సవరించుకునే అవకాశం కల్పించామని తెలిపారు. మిస్సింగ్ సర్వే నంబర్లు, విస్తీర్ణ సవరణ దరఖాస్తుల్లో ఆర్ఎస్ఆర్ విస్తీర్ణం, ప్రస్తుతం ఉన్న సర్వే నంబర్లు పరిశీలించి పరిష్కరించాలని వివరించారు.

వ్యాధుల కాలం.. జర పైలం



జిల్లా కేంద్రంలో డ్రైడే కార్యక్రమంలో పాల్గొన్న డీఎంహెచ్‌వో ధనరాజ్, వైద్య సిబ్బంది

- సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం
- ముందు జాగ్రత్తలు చేపడుతున్న వైద్యశాఖ
- మలేరియా, డెంగీ, టైఫాయిడ్, చికున్ గన్యా ప్రబలే అవకాశం
- వారంలో రెండురోజులు డ్రైడే నిర్వహణకు శ్రీకారం

నిర్మల్‌చైన్‌గేట్: వర్షాకాలం ప్రారంభమైంది. సీజనల్ వ్యాధుల ముప్పు పొంచి ఉంది. అయితే జాగ్రత్తలు పాటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే రోగాల బారిన పడి ఇబ్బందులు ఎదుర్కోక తప్పదు. మన ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మన చేతుల్లోనే ఉంది. ఈ నేపథ్యంలోనే వర్షాకాలంలో వచ్చే మలేరియా, డెంగ్యూ, చికుగన్యా, టైఫాయిడ్, మెదడువాపు వ్యాధులపై జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. ప్రజలను అప్రమత్తం చేయడంతోపాటు సీజనల్ వ్యాధుల బారిన ఉండేందుకు ముందస్తు జాగ్రత్తలపై అవగాహన కల్పించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.

గతేడాది నమోదైన ప్రాంతాల్లో..

జిల్లా ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు జాగ్రత్తలు పాటించాలని వైద్య సిబ్బంది సూచిస్తున్నారు. నిర్మల్, ముధోల్, ఖానాపూర్ నియోజకవర్గాల్లోని ప్రతీ మంగళ, శుక్రవారాల్లో డ్రైడే పేరిట పీహెచ్సీ పరిధిలోని ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు గ్రామాల్లోని ఇళ్లకు వెళ్లి నీటి నిల్వ ఉండకుండా, వాటిలో దోమ లార్వా పెరగకుండా అవగాహన కల్పిస్తున్నారు. గడిచిన ఏడాది హైరిస్క్ కేసులు నమోదైన ప్రాంతాల్లో ముందస్తుగా సీజనల్ వ్యాధుల బారినపడకుండా ఉండటం కోసం వైద్య శిబిరాలు నిర్వహించనున్నారు.

గతంలో నమోదైన కేసులు..

జిల్లాలో 2021 సంవత్సరంలో 168 డెంగ్యూ కేసులు, 2022లో 98 కేసులు నమోదయ్యాయి. రెండేళ్లుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో టైఫాయిడ్, మలేరియా, చికుగన్యా కేసులు నమోదు కాలేదని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు వెల్లడిస్తున్నారు. అయితే ప్రైవేట్ ఆస్పత్రుల్లో గత రెండేళ్లుగా టైఫాయిడ్, మలేరియా కేసులు వందల సంఖ్యలో నమోదైనట్లు సమాచారం. ఈ ఏడాది కూడా సీజనల్ వ్యాధుల నియంత్రణకు వైద్య ఆరోగ్య శాఖ చర్యలు చేపడుతోంది. వైద్య సిబ్బంది, పంచాయతీ సిబ్బంది సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉంది. ప్రధానంగా గ్రామాల్లో చెత్తకుప్పలు, కాలువల్లో మురుగు తొలగించాలి. దోమలు వ్యాప్తి చెందకుండా, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. మురుగు కాల్వల్లో అబైట్ ఆయిల్‌ను పిచికారీ చేస్తే దోమల వ్యాప్తిని వరకు అరికట్టవచ్చు.


జాగ్రత్తలు పాటించాలి...



వర్షాకాలంలో విష జ్వరాలు ప్రబలే ప్రమాదం ఉంది. ప్రతి ఒక్కరూ త గిన జాగ్రత్తలు తీసుకుంటే అనారోగ్యం బారిన పడకుండా చూసుకోవ చ్చు. నిల్వ పదార్థాలను తినొద్దు. కాచి చల్లార్చిన నీటినే తాగాలి. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. దోమల వ్యాప్తిని అరికట్టాలి. ఈ సంవత్సరం వారంలో రెండు రోజులు డ్రైడే నిర్వహిస్తున్నాం.

– ధనరాజ్, డీఎంహెచ్‌వో

నివారణ చర్యలు చేపడుతాం..



ఈ సంవత్సరం ఆలస్యంగా వర్షాలు కురుస్తున్నాయి. అయినా దోమల నివారణ కోసం ప్రణాళిక రూపొందిస్తున్నాం. ప్రజలు డెంగీ, మలేరియా వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తాం. పరిశుభ్రత, దోమల నివారణకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తాం. దోమతెరల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదిస్తాం.

– రాజా రవీందర్, జిల్లా మలేరియా నివారణ అధికారి

రైల్వేలైన్ ప్రస్తావించేనా..?

- 'ఆదిలాబాద్–ఆర్మూర్'పై కదలిక వచ్చేనా
- నేడు రాష్ట్రానికి ప్రధాని మోదీ రాక
- పెండింగ్ ప్రాజెక్టుపై సర్వత్రా ఆశలు
- సర్వే పూర్తయిందని రైల్వేశాఖ ఇప్పటికే స్పష్టం
- ఏటా పెరుగుతున్న అంచనా వ్యయం



ఆదిలాబాద్ రైల్వేస్టేషన్‌లో జీఎం అరుణ్ కుమార్(ఫైల్)

సాక్షి, ఆదిలాబాద్: గత ఏప్రిల్ 28న ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్ పరిశీలనకు వచ్చిన దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ ఆదిలాబాద్–ఆర్మూర్ రైల్వేలైన్ అంశాన్ని ప్రస్తావించారు. సర్వే పూర్తయిందని స్పష్టం చేశారు. అయితే నిర్మాణ పనుల విషయంపై ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. ఎన్నో ఏళ్లుగా ఈ ప్రాజెక్టు చేపట్టాలని ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల ప్రజల డిమాండ్‌గా ఉంది. ఈమేరకు ఢిల్లీలో కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను గురువారం కలిసిన ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు ఈ లైన్ ఏర్పాటు విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఈ నేపథ్యంలో నేడు వరంగల్‌కు వివిధ అభివృద్ధి పనులు ప్రారంభించేందుకు ప్రధాని మోదీ విచ్చేస్తున్నారు. ఈ క్రమంలో ఉత్తర తెలంగాణలో ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ ప్రాజెక్టుపై ఏదైనా ప్రస్తావిస్తారా అనే ఆశ ఈ ప్రాంతవాసుల్లో నెలకొంది.

ఎంతో ఉపయుక్తం..

ఆదిలాబాద్ నుంచి వయా నిర్మల్, ఆర్మూర్, కామారెడ్డి మీదుగా హైదరాబాద్‌కు రోడ్డు మార్గంలో వెళ్లాలంటే 300 కిలోమీటర్లు. అదే ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్‌కు రైలు మార్గంలో వెళ్లాలంటే ముందుగా ఇక్కడ మహారాష్ట్రలోని ముత్ఖేడ్ జంక్షన్‌లో ఎంటర్ కావాల్సి వస్తుంది. అక్కడి నుంచి లోకో రివర్సల్ ద్వారా ట్రెయిన్ తెలంగాణలోని బాసర, నిజామాబాద్ మీదుగా హైదరాబాద్‌కు చేరుకుంటుంది. ఈ ప్రయాణం 411 కిలో మీటర్లు. ఈ క్రమంలో ఆదిలాబాద్ నుంచి వయా నిర్మల్, ఆర్మూర్ మీదుగా హైదరాబాద్‌కు రైల్వేలైన్ నిర్మించాలన్నది దశాబ్దాల డిమాండ్. గతంలో పటాన్‌చెరు, సంగారెడ్డి, మెదక్, నిజామాబాద్ మీదుగా ఆదిలాబాద్‌కు రైల్వేలైన్ నిర్మించాలని డిమాండ్ ఉండేది. ఆ తర్వాత నిజామాబాద్–పెద్దపెల్లి మధ్య రైల్వేలైన్ పూర్తి కావడంతో ఆదిలాబాద్–ఆర్మూర్ రైల్వే లైన్‌గానే సంభోదిస్తూ వస్తున్నారు.

ప్రతీ బడ్జెట్‌లో నిరాశే..

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2016–17 కేంద్ర బడ్జెట్‌కు ముందు సీఎం కేసీఆర్ సూచనలకు అనుగుణంగా అప్పట్లో రాష్ట్ర మంత్రులుగా ఉన్న జోగు రామన్న, ఇంద్రకరణ్‌రెడ్డిలు అప్పటి ఎంపీ గొడం నగేష్‌తో కలిసి అప్పటి కేంద్ర రైల్వేశాఖ మంత్రి సురేష్ ప్రభును కలిశారు. ప్రధానంగా ఆదిలాబాద్–ఆర్మూర్ రైల్వే లైన్ నిర్మాణంలో రాష్ట్ర వాటా కింద 50 శాతం నిధులు భరిస్తామని తెలిపారు. దీంతో అప్పటి కేంద్ర బడ్జెట్‌లో క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ కింద మంజూరు ఇచ్చింది. 136 కిలో మీటర్ల పరిధిలో రూ.2,720 కోట్ల అంచనా వ్యయంతో ఈ లైన్‌ను ప్రతిపాదించింది. ఇందులో రాష్ట్రం వాటా 50 శాతం అంటే.. సుమారుగా రూ.1,360 కోట్లు భరించాలి. 2019 సాధారణ ఎన్నికల్లో ఎంపీగా బీజేపీ నుంచి సోయం బాపూరావు గెలిచిన తర్వాత ఈ ప్రాజెక్టుపై పార్లమెంట్ పరిధిలోని ప్రజలకు ఎన్నో ఆశలు నెలకొన్నాయి. దానికి తగ్గట్టే ఆయన కేంద్ర రైల్వే మంత్రులను, రైల్వే అధికారులను కలుస్తూ ప్రాజెక్టు విషయంలో ప్రత్యేక దృష్టి సారించి పూర్తి చేయాలని కోరుతూ వస్తున్నారు. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సరైన సంబంధాలు లేకపోవడంతో ఈ ప్రాజెక్ట్ నిర్మాణ ఒప్పందం విషయం ముందుకు సాగడం లేదు. ఇదిలా ఉంటే ఏటా దీని అంచనా వ్యయం పెరుగుతూ వస్తోంది. మొదట్లో రూ.వెయ్యి కోట్ల లోపు అంచనా వ్యయం ఉండగా, ఆ తర్వాత రూ.1,200 కోట్లకు, ప్రస్తుతం రూ.2,720 కోట్లుగా ఉంది. తాజాగా మళ్లీ అంచనాలు మారే అవకాశం ఉంది.

రెండు లోకసభ నియోజకవర్గాలకు ప్రయోజనం..

ఈ రైల్వేలైన్ పూర్తయితే ఆదిలాబాద్, నిజామాబాద్ లోకసభ నియోజకవర్గాల పరిధిలోని ఆదిలాబాద్, బోథ్, నిర్మల్, బాల్కొండ, ఆర్మూర్ నియోజకవర్గాలకు ప్రయోజనం చేకూరుతుంది. ఈ రెండు లోక్‌సభ నియోజకవర్గాల్లో బీజేపీ ప్రజాప్రతినిధులే ప్రాతినిధ్యం వహిస్తున్న దృష్ట్యా వచ్చే ఎన్నికలకు ముందే ఈ పెండింగ్ ప్రాజెక్టుపై ఇరు ప్రభుత్వాలు దృష్టి సారిస్తాయా.. లేదా అనేది వేచి చూడాల్సిందే.

వచ్చే బడ్జెట్‌లో ప్రకటించే అవకాశం..



వచ్చే బడ్జెట్‌లో ఆదిలాబాద్–ఆర్మూర్ రైల్వేలైన్ నిర్మాణానికి నిధులు ప్రకటించే అవకాశాలున్నాయి. దీనికి కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా ఉంది. తాజాగా కూడా రైల్వే మంత్రిని కలిసి ఈ ప్రాజెక్టు విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలని కోరడం జరిగింది.

– సోయం బాపూరావు, ఎంపీ, ఆదిలాబాద్

ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు నవీన్‌కుమార్

నిర్మల్ రూరల్: రాష్ట్రంలో ఉపాధ్యాయుల సర్దుబాటు త్వరగా పూర్తిచేయాలని తపస్ జిల్లా అధ్యక్షుడు నవీన్‌కుమార్ కోరారు. జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో ఉపాధ్యాయ బదిలీలు పదోన్నతులు చేపట్టకపోవడం, జీవో 317తో ఏర్పడ్డ అసందిగ్ధ పరిస్థితులు ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేస్తున్నాయన్నారు. సమస్యలను పరిష్కరించడంలో విద్యాశాఖ అలసత్వం వహించడంతో విద్యా ప్రమాణాలు క్షీణిస్తున్నాయని తెలిపారు. ఇప్పటికైనా ఉపాధ్యాయుల సమస్యలను అధికారులు, ప్రభుత్వం అర్థం చేసుకుని పాఠశాల విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని వివిధ పాఠశాలల్లో సబ్జెక్టు బోధకులు లేకపోవడంతో విద్యార్థులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. అధికార యంత్రాంగం విద్యార్థులకు, పాఠశాల అవసరాలకు అనుగుణంగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేసి ప్రభుత్వ పాఠశాలను కాపాడాలని కోరారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సుదర్శన్, నాయకులు జి.రాజేశ్వర్, చంద్రప్రకాశ్, ధీరజ్‌కులకర్ణి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గూటికి నారాయణ్‌రావు పటేల్..!



భైంసాటౌన్: ముధోల్ మాజీ ఎమ్మెల్యే భోస్లే నారాయణ్‌రావు పటేల్ తిరిగి కాంగ్రెస్ పార్టీలోకి చేరతా రని విస్తృత ప్రచారం జరుగుతోంది. ఆయన అనుచరులు పలువురు సోషల్‌మీడియాలో పోస్టులు పెడుతూ హల్‌చల్ చేస్తున్నారు. పార్టీ రాష్ట్ర వ్యవహా రాల ఇన్‌చార్జి మానిక్‌రావు థాక్రే ఫోన్‌లో సంప్రదింపులు జరిపినట్లు పేర్కొంటున్నారు. పలువురు రాష్ట్ర ముఖ్యనేతలు సైతం పార్టీలోకి తిరిగి రావాలని కోరినట్లు సమాచారం. ఇదిలా ఉండగా, హైదరా బాద్‌లో ఇటీవల మోకాలి శస్త్రచికిత్స పూర్తి చేసుకుని శుక్రవారం భైంసాకు వచ్చిన సందర్భంగా పలువురు అనుచరులు ఆయన్ను కలిసి పరామర్శించారు.

పోడు సాగును అడ్డుకున్న అటవీ అధికారులు

- గిరిజనులకు, అధికారులకు మధ్య వాగ్వాదం
- ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన గిరిజనులు
- పోడుభూములకు హక్కుపత్రాలివ్వాలని డిమాండ్


అటవీ అధికారుల కాళ్లపై పడి వేడుకుంటున్న గిరిజన మహిళ

ఖానాపూర్: మండలంలోని అడవి సారంగాపూర్ పంచాయతీ పరిధిలోని జిల్లెడుకుంటలోని పోడు భూముల్లో శుక్రవారం సేవ్యానాయక్ తండాకు చెందిన గిరిజనులు చేపట్టిన సాగు పనులను అటవీశాఖ అధికారులు అడ్డుకున్నారు. దీంతో గిరిజనులకు, అధికారులకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా గిరిజనులు మాట్లాడుతూ గత కొన్ని దశాబ్దాలుగా తాము పోడు వ్యవసాయం చేసుకుంటున్నామన్నారు. గత ఏడాది అధికారులు సర్వే చేసి హక్కు పత్రాలు ఇస్తామని చెప్పినప్పటికీ ఇవ్వకుండా తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 19 సర్వే నంబర్‌లోని వందకు పైగా ఎకరాల్లోని భూమి గతంలో నుంచే రెవెన్యూ పరిధిలో ఉందని తెలిపారు. ఈ సందర్భంగా అటవీ అధికారులు మాట్లాడుతూ కంపార్ట్‌మెంట్ 862లోని ఈ భూమి సత్తనపల్లి అటవీ సెక్షన్ పరిధిలోకి వస్తుందని చెప్పారు. అనుమతి లేకుండా అటవీ భూముల్లో ఎటువంటి సాగు పనులు చేయవద్దని తెలిపారు. ఈ క్రమంలో సాగుపనులను అధికారులు అడ్డుకోవడాన్ని నిరసిస్తూ పలువురు మహిళలు డీజిల్ పోసుకుని ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డారు. అయినప్పటికీ అధికారులు అడ్డుకోవడంతో అధికారుల కాళ్లవేళ్లా పడి వేడుకున్నారు. వారు ఎంతకూ వినకపోవడంతో మాలావత్ శోభతో పాటు పోర కళ అనే మహిళలు అక్కడే ఉన్న వ్యవసాయ బావిలోకి దూకేందుకు యత్నించారు. అనంతరం అక్కడికి ఏబీపీకేఎస్ జిల్లా అధ్యక్షుడు నంది రామయ్య చేరుకుని మాట్లాడారు. అధికారులు వెంటనే రీ సర్వే చేసి పోడు హక్కు పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఇందులో అటవీ అధికారులు సాంబయ్య, సీతారాం, శ్రీలత, కీర్తి, ఖాజిం, నారాయణ, లాలాజీ, సంధ్య, ఏఎస్సై రాంచందర్ ఉన్నారు.


సొమ్మసిల్లి పడిపోయిన మహిళ


బావిలో దూకేందుకు యత్నిస్తున్న మహిళలను అడ్డుకుంటున్న స్థానికులు


మాట్లాడుతున్న నంది రామయ్య

సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్ల రికవరీ

- ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి


బాధితులకు ఫోన్‌లు అందిస్తున్న ఎస్పీ

ఆదిలాబాద్‌టౌన్: చోరీకి గురైన, పోగొట్టుకున్న వారి మొబైల్ ఫోన్లు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేయడం జరుగుతుందని ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి అన్నారు. ఆదిలాబాద్, మావల, ఇచ్చోడ, తలమడుగు పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో మొబైల్ ఫోన్‌లు పోగొట్టుకున్న బాధితులకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో మొబైల్ ఫోన్‌లను తిరిగి అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొబైల్ ఫోన్‌లు పోగొట్టుకున్నవారు పోర్టల్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని, పోర్టల్ ద్వారా సులభంగా మొబైల్ ఫోన్‌లను గుర్తించడం జరుగుతుందన్నారు.

ఒకరి అదృశ్యం

ఖానాపూర్: ఖానాపూర్ పట్టణంలోని పద్మావతినగర్‌కు చెందిన బండి లింగాగౌడ్ ఈ నెల 6న ఇంటి నుంచి వెళ్లి అదృశ్యమైనట్లు ఎస్సై ఆర్. శంకర్ తెలిపారు. ఉదయం 10గంటలకు వెళ్లిన లింగాగౌడ్ నేటికి తిరిగిరాకపోవడంతో అతడి కుమారుడు హరికృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

నేడు చీడపీడల యాజమాన్యంపై 'ముచ్చట'

ఎదులాపురం: ఆకాశవాణి ఆదిలాబాద్ ప్రసారం చేసే కిసాన్‌వాణి కార్యక్రమంలో శనివారం 'కూరగాయల నారుమడుల్లో వచ్చే చీడపీడల యాజమాన్యం'పై స్థానిక ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకురాలు సి. అశ్వినితో ముచ్చట కార్యక్రమం ఉంటుందని ప్రోగ్రాం హెడ్ రామేశ్వర్ కేంద్రే ఒక ప్రకటనలో శుక్రవారం తెలిపారు. ఈ కార్యక్రమం రాత్రి 7.15 గంటలకు ప్రసారం అవుతుందని, రైతులు, శ్రోతలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్: బీసీ సంక్షేమ శాఖ బీసీ స్టడీ సర్కిల్ సెంటర్ హైదరాబాద్ ఆధ్వర్యంలో అందించే సివిల్ సర్వీస్ లాంగ్ టర్మ్ శిక్షణకు (ప్రిలిమ్స్ కమ్‌మెయిన్స్) ఉచిత శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి రాజలింగు, స్టడీ సర్కిల్ సెంటర్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్‌లు శుక్రవారం తెలిపారు. ఈ నెల 10లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 16న ఆన్‌లైన్ స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించనున్నట్లు వివరించారు. శిక్షణ తరగతులు ఈ నెల 31 నుంచి ప్రారంభమై 30 ఏప్రిల్ 2024 వరకు బీసీ స్టడీ సర్కిల్, ఉస్మానియా యూనివర్సిటీ సెంటర్, ఓయూ క్యాంపస్ తార్నాకలో జరుగతాయన్నారు. శిక్షణ కాలంలో లాడ్జింగ్, బోర్డింగ్, రవాణా ప్రయాణం కోసం రూ.5వేలు, ప్రవేశం పొందినంతరం రూ.5వేల విలువ చేసే పుస్తకాలు అందించనున్నట్లు వివరించారు. 31 ఏళ్లలోపు వయస్సు కలిగి గతంలో సివిల్ సర్వీస్ (ప్రిలిమ్స్) పరీక్షలలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు మాత్రమే అర్హులన్నారు. దరఖాస్తు చేసుకునే సమయంలో అభ్యర్థి కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్లు జత చేయాలన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ డిగ్రీ పాసైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు ఫోన్ నంబర్ 08732 221280పై సంప్రదించాలన్నారు.

'పది' ఫలితాల్లో నాలుగో స్థానం

నిర్మల్‌రూరల్: పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ ఫలితాల్లో జిల్లా రాష్ట్రంలోనే నాలుగో స్థానంలో నిలిచింది. శుక్రవారం హైదరాబాద్‌లో ఫలితాలను విడుదల చేశారు. జిల్లాలో మొత్తం 86 మంది పరీక్షలు రాయగా 79 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇందులో బాలురు 48 మంది రాయగా 42 మంది, బాలికలు 38 మంది రాయగా 37 మంది ఉత్తీర్ణులయ్యారు. జిల్లా వ్యాప్తంగా 91.86 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు.

5 లీటర్ల గుడుంబా పట్టివేత


పట్టుకున్న గుడుంబాతో పోలీసులు

గుడిహత్నూర్: మండలంలోని నేరడిగొండ తండాలో పోలీసులు చేపట్టిన సోదాల్లో రాథోడ్ బేబిబాయి ఇంట్లో తయారు చేసిన ఐదు లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. దీంతో పాటు గుడుంబా తయారీకి వాడే ముడిసరుకు ఇప్పపువ్వు 20 కేజీలు స్వాధీనం చేసుకున్నారు. ఇప్పపువ్వు పానకం ధ్వంసం చేశారు. గుడుంబా తయారు చేస్తే చర్యలు తప్పవని ఎస్సై ప్రవీణ్‌కుమార్ హెచ్చరించారు. సదరు మహిళపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సోదాల్లో ఏఎస్సై రహమాన్, హెడ్‌కానిస్టేబుల్ వాణి, సిబ్బంది జలీల్‌ఖాన్, సరస్వతీ, ఉత్తం ఉన్నారు.

బతకలేక..'పోతున్నా..'

- కొడుకులు దూరంగా ఉండడంతో మనస్తాపం
- ఉరేసుకుని వృద్ధుడి ఆత్మహత్య


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై విక్రమ్

తానూరు: ఆ తండ్రి వయసు 70ఏళ్లు.. భార్య రుక్మాబాయి, నలుగురు కొడుకులు ఉన్నా రు. వ్యవసాయం చేసుకుంటూ పిల్లల్ని పెంచి పెద్దచేశాడు. ఉన్నంతలో చదివించి ప్రయోజకులను చేశా డు. పెళ్లిళ్లు జరిపించాడు. రెక్కలు వచ్చిన పక్షులు ఎగిరిపోయినట్లు.. ఉద్యోగం, ఉపాధి నిమిత్తం ఇద్దరు కొడుకులు హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. మరో కొడుకు భైంసాలో ఉంటున్నాడు. చిన్న కొడు కు మాత్రమే తల్లిదండ్రులను చూసుకుంటున్నాడు. మలి దశలో తనకు తోడుగా ఉంటారనుకున్న కొడుకులు స్థానికంగా ఉండడం లేదని కొన్నిరోజులుగా మదనపడుతున్నాడు. వృద్ధాప్యంతో అనారోగ్య సమస్యలు పెరుగుతున్నాయి. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం చేను వద్దకు వెళ్లొస్తానని భార్యకు చెప్పి వెళ్లాడు. అక్కడే చెట్టుకు ఉరేసుకుని తనువు చాలించాడు. ఈ విషాద ఘటన మండలంలోని తొండాల గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై విక్రమ్ వివరాల ప్రకారం.. లోకండే గౌతం(70)కు నలుగురు కుమారులు. ఇద్దరు కుమారులు హైదరాబాద్‌లో ఉంటున్నారు. మరో కుమారుడు భైంసాలో స్థిరపడాడు. చిన్నకుమారుడు స్వగ్రామంలో వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. హైదరాబాద్, భైంసాలో ఉంటున్న కుమారులు శుభ కార్యాలయాలకు తొండాలకు వచ్చి వెళ్లేవారు. వృద్ధాప్యంలో కొడుకులు దూరంగా ఉంటున్నారని తీవ్ర మనస్తాపానికి గురై శుక్రవారం ఉదయం వ్యవసా య చేనులో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన స్థానికులు కుటుంబీకులకు, పో లీసులకు సమాచారం అందించారు. ఎస్సై విక్రమ్ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీ లించారు. మృతుడి భార్య రుక్మాబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

- త్రీఫేజ్ విద్యుత్ సరఫరాను ప్రారంభించిన అధికారులు


త్రీఫేజ్ విద్యుత్ సరఫరాను ప్రారంభిస్తున్న అధికారులు

ఇంద్రవెల్లి: గ్రామీణ ప్రాంతంలోని రైతుల వ్యవసాయ భూములకు సాగు నీరు అందించేందుకు ప్రభుత్వం కల్పించిన త్రీఫేజ్ విద్యుత్ సరఫరాతో ఆర్థికంగా అభివృద్ధి చెందాలని నిర్మల్, ఆదిలాబాద్ ఎస్‌ఈలు చౌహాన్ జైవంత్‌రావ్, సంపత్‌కుమార్ లున్నారు. శుక్రవారం మండలంలోని వాల్గొండ గ్రామానికి సందర్శించి రూ.60లక్షల నిధుల ఖర్చుతో సరఫరా చేసిన త్రీఫేజ్ విద్యుత్ సరఫరాను ప్రారంభించారు. అనంతరం రైతు వేదికలో వ్యవసాయ భూములకు త్రీఫేజ్ సరఫరా చేయడానికి కృషి చేసిన అధికారులకు శాలువలతో సన్మానం చేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌టీఎస్‌డీఎఫ్ పథకం ద్వారా వ్యవసాయ రైతులకు ఉచితంగా త్రీఫేజ్ విద్యుత్‌ను అందిస్తుందన్నారు. ఇంద్రవెల్లి మండలంలోని వాల్గొండ గ్రామపంచాయతీ పరిధిలోని 50మంది రైతుల వ్యవసాయ భూముల్లో రూ.60లక్షల నిధులు ఖర్చు చేసి త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేయడం జరిగిందని తెలిపారు. రైతులు త్రీఫేజ్ విద్యుత్ సరఫరాను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ కినక జుగాదిరావ్, విద్యుత్‌శాఖ టెక్నికల్ డీఈ ఈదన్న, కన్సల్టేషన్ డీఈ ప్రభాకర్, విజిలెన్స్ డీఈ నందయ్య, విద్యుత్ శాఖ డీఈ జాదవ్ సుభాష్, ఏడీఈలు చంద్రశేఖర్, సుమలత, మండల ఏఈ రాథోడ్ రోహిదాస్, జూనియర్ లైన్‌మెన్ సురేష్, రైతులు కినక లచ్చుపటేల్, నర్సయ్య, జాదవ్ బాను, ఆర్క యాదవ్‌రావ్ ఉన్నారు.

రైతువేదిక నిర్వహణ ఎలా..

- నిర్వహణకు నిధులు ఆపేసిన ప్రభుత్వం
- జిల్లాలోని 101 రైతు వేదికలకు రూ.90లక్షలకు పైగానే బకాయిలు

జిల్లాలో రైతుల వేదకలు: 101
బకాయిలు : రూ. 90 లక్షల 90 వేలు



బోథ్‌లోని రైతు వేదిక

బోథ్: రైతు వేదికల నిర్వహణకు ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు ఆగిపోయాయి. గత సంవత్సరం సెప్టెంబర్ నుంచి నిధులు రావడం లేదు. దీంతో రైతు వేదికల నిర్వహణ వ్యవసాయ విస్తరణ అధికారులకు భారంగా మారింది. కొంత వరకు నిర్వహణకు స్వంతంగా అధికారులు ఖర్చు చేసుకుంటున్నారు. ప్రభుత్వం ఇటీవల దశాబ్ది ఉత్సవాలను నిర్వహించింది. రైతు వేదికల వద్ద ఆర్భాటంగా ఉత్సవాలు నిర్వహించిన వ్యవసాయ శాఖ వాటి నిర్వహణకు నిధులివ్వడంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు వ్యవసాయ అధికారులు వాపోతున్నారు. రెండేళ్ల కిందట కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో క్లస్టర్ల వారీగా రైతు వేదికలను నిర్మించిన ప్రభుత్వం వ్యవసాయ విస్తరణాధికారులను నియమించి రైతు వేదికల నుంచి కార్యకలాపాలు సాగించాలని సంకల్పించింది. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం కేటాయించిన వ్యవసాయ విస్తరణాధికారులు రైతు వేదికలో రైతులకు అందుబాటులో ఉంటూ మిగతా సమయంలో క్షేత్రాలను సందర్శించి వారికి సలహాలివ్వాలని ఆదేశాలిచ్చింది. మంచినీరు, విద్యుత్, పారిశుద్ధ్యం వంటి నిర్వహణ ఖర్చులకు ప్రతి నెలా రూ.9వేలు అందిస్తామని ప్రకటించింది. కానీ గత సెప్టెంబరు నుంచి వీటిని విడుదల చేయకపోవడంతో విస్తరణ అధికారులు సొంతంగా నెలనెలా ఖర్చులు చెల్లించుకోలేక అవస్థలు పడుతున్నారు. జిల్లాలోని 101 రైతు వేదికలకు రూ.90లక్షల 90 వేలు చెల్లించాలి. తాజాగా ఉత్సవాల పేరుతో చేపట్టిన కార్యక్రమాల్లోనూ వీరు స్వయంగా ఆవరణలు శుభ్రం చేయించడం, ఇతరత్రా పనుల్ని సొంతంగా నిర్వహించాల్సి వచ్చింది. ఇందుకు ఒక్కో కేంద్రానికి కనీసం రూ.10 వేలకు పైగా ఖర్చు అయినట్లు తెలుస్తోంది.

ఒక్కో వేదికకు రూ.90వేలు రావాలి...
గతేడాది సెప్టెంబరు నుంచి ప్రభుత్వం రైతు వేదికలకు నిధులు విడుదల చేయలేదు. అప్పటి నుంచి వ్యవసాయ విస్తరణ అధికారులు సొంతంగా నిర్వహణ ఖర్చులు చెల్లిస్తున్నారు. గత సెప్టెంబర్ నుంచి జూన్ వరకు ఒక్కో రైతు వేదికకు ప్రభుత్వం రూ.90వేల బకాయిలు పడింది. గత ఆర్థిక సంవత్సరం ముగింపు దశలోనైనా బకాయిలు చెల్లిస్తారని ఆశించినా ప్రయోజనం లేదని అధికారులు వాపోతున్నారు.

ఊరికి దూరంగా...
పలు చోట్ల రైతు వేదికలు గ్రామాలకు దూరంగా ఉండడంతో రైతులు అక్కడికి వచ్చేందుకు ఆసక్తి చూపడం లేదు. పైఅధికారుల ఆదేశాల మేరకు వ్యవసాయ విస్తరణాధికారులు అక్కడే ఉంటూ ప్రతి రోజూ రైతు వేదికల్లో రైతుల కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. ఈ వేదికలో వ్యవసాయ అధికారి, రైతుబంధు అధ్యక్షుడు కూర్చునేందుకు కుర్చీలు, బల్లలు, మైక్‌సైట్ వంటివి సమకూర్చారు. ప్రజా ఉపయోగ కార్యక్రమాలు వివిధ శాఖల సమావేశాలకు వీటిని వాడుకునేలా ప్రభుత్వం అవకాశం కల్పించింది. సమావేశం తరువాత రైతు వేదికను శుభ్రం చేసుకోవాల్సిన బాధ్యత వ్యవసాయ విస్తరణ అధికారిపై పడుతోంది. వీటి నిర్వహణ భారంగా మారుతోంది. మరోవైపే మురుగుదొడ్లు శుభ్రం చేయడానికి నిధులు లేక అవి ఉపయోగంలో లేవు.

నిర్వహణకు నిధులు లేక...
రైతు వేదిక నిర్వహణకు ప్రభుత్వం నెలవారి నిధులు కేటాయించాలని పలువురు వ్యవసాయ విస్తరణ అధికారులు పేర్కొంటున్నారు. కనీసం మరుగుదొడ్ల నిర్వహణకు కూడా నిధులు లేవని, అన్నీ మేమే భరించాల్సి వస్తుందని వారు వాపోతున్నారు. అధికారులకు ఈ విషయం గురించి చెబితే ప్రభుత్వం నుంచి నిధులు రావడం లేదంటున్నారని, మీరే భరించుకోవాలని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సొంతంగా కొన్ని భరిస్తున్నా.. మొత్తం మోయలేని భారంగా మారిందని వారు వాపోతున్నారు.

స్కూల్ బస్సును ఢీకొట్టిన ఘటనలో కేసు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట శివారులోని శివయ్య కాలనీ వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉదయం పాఠశాలకు తీసుకువెళ్లేందుకు శివయ్య కాలనీ వరకు వచ్చిన మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందిన బస్సును డ్రైవర్ జాతీయ రహదారిపై నిలిపాడు. ఈ క్రమంలో లక్సెట్టిపేట వైపు వెళ్తున్న ఓ ఐషర్ వ్యాన్ వెనుక నుంచి స్కూల్ బస్సును ఢీకొట్టింది. వ్యాన్ డ్రైవర్ మహేందర్ అతివేగం, అజాగ్రత్తతో వాహనం నడపడమే కాకుండా ప్రమాదం తర్వాత పరారవుతుండగా పోలీసులు పట్టుకున్నారు. వ్యాన్ డ్రైవర్ మహేందర్‌ను పరీక్షించగా మద్యం తాగినట్లు తేలింది. బస్సు యజమాని సానా వెంకటేశ్వర్‌రావు ఫిర్యాదు మేరకు మహేందర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దాడిచేసిన వారిపై..

కుభీర్: మండలంలోని పల్సి గ్రామంలో ఆస్తితగదాలో దన్నరి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎండీ.షరీఫ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. పల్సికి చెందిన దన్నరి పోతన్నకు ఇద్దరు భార్యలు ఉండగా మొదటి భార్యకు కొడుకు, కూతురు ఉన్నారు. రెండవ భార్యకు ఇద్దరు కూతుళ్లు, కొడుకు ఉన్నారు. పోతన్న రెండవ భార్యవద్ద ఉంటూ ఆస్తి మొత్తం ఆయన పేరుపై ఉంచుకున్నాడు. మొదటి భార్య, పిల్లలు వేరుగా ఉంటున్నారు. కస్రా శివారులోని చేనులో మొదటి భార్య, కొడుకు, కూతురు గురువారం పనులు చేస్తుండగా... పోతన్న రెండవ భార్య లక్ష్మి, కొడుకు, కూతురు, అల్లుడు వెళ్లి కర్రలతో దాడికి దిగారు. దీంతో ఆశవ్వకు తీవ్ర గాయాలు కాగా ప్రస్తుతం భైంసా ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కడుపునొప్పి భరించలేక ఆత్మహత్య

తిర్యాణి: కడుపు నొప్పి భరించలేక ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని అర్జున్‌లొద్ది గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. అర్జున్‌లొద్ది గ్రామానికి చెందిన సోముని భీమయ్య (46) కొంత కాలంగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. నొప్పి భరించలేక తరచూ మద్యం సేవిస్తుండేవాడు. మూడు రోజులుగా కడుపునొప్పి తీవ్రం కాగా భరించలేక ఈనెల 6న రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. అనంతరం బయటకు వెళ్లి తాను పురుగుల మందు తాగానని చెప్పగా వెంటనే అతడిని మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి భార్య మైసక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆవిష్కరణలకు ఆహ్వానం

- 'ఇంటింటా ఇన్నోవేటర్'కు శ్రీకారం
- ఆగస్టు5 వరకు దరఖాస్తుల స్వీకరణ
- విద్యార్థులతోపాటు అన్నివర్గాల వారూ అర్హులే..
- జిల్లాస్థాయిలో ఉత్తమ ఆవిష్కరణలకు ప్రోత్సహకాలు..
- ఆగస్టు 15న జిల్లాకేంద్రంలో ప్రదర్శన, బహుమతుల ప్రదానం


'ఇంటింట ఇన్నోవేటర్' కరపత్రాలను విడుదల చేస్తున్న కలెక్టర్ వరుణ్‌రెడ్డి, డీఈఓ రవీందర్‌రెడ్డి

నిర్మల్‌ఖిల్లా: అవసరం ఆవిష్కరణలవైపు అడుగులు వేయిస్తుంది. కొత్తగా, భిన్నంగా ఆలోచించే ప్రతి ఒక్కరూ ఆవిష్కర్తలే. ఇందుకోసం చేయాల్సిందల్లా సృజనాత్మక ఆలోచనలకు సామాజిక అంశాలను జోడించడమే. అవసరాల కోసం ప్రయోగాలు చేసే విద్యార్థులతోపాటు అన్నివర్గాల వారిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం 'ఇంటింటా ఇన్నోవేటర్' కార్యక్రమం నిర్వహిస్తోంది. ప్రతి ఒక్కరిలో ఏదో ఒక ప్రతిభ ఉంటుంది. దానికి సృజనాత్మకత తోడైతే సత్ఫలితాలు వస్తాయి. ఎంతోమంది తమను ప్రోత్సహించే వారు లేక మరుగునపడుతున్నారు. వారి ఆవిష్కరణలను వెలుగులోకి తేవడమే ఇంటింటా ఇన్నోవేటర్ ప్రధాన ఉద్దేశం.

అందరూ అర్హులే..
'ఇంటింటా ఇన్నోవేటర్'కు జిల్లాలోని వివిధ దశల్లో విద్యనభ్యసిస్తున్న వారే కాకుండా నిరక్షరాస్యులు, రైతులు, వివిధ కులవృత్తుల వారు, ఇలా.. ఎవరైనా తమ మనసులో మెదిలిన ఆలోచనకు సృజనాత్మక జోడించి కొత్త ఆవిష్కరణకు రూపకల్పన చేసేలా ప్రోత్సహిస్తున్నారు. ఇందుకోసం ఆగస్టు 5 వరకు పూర్తి వివరాలతో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. వచ్చిన దరఖాస్తుల్లో ఉత్తమ ఆవిష్కరణలను ఎంపిక చేసి స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసే స్టాళ్లలో ప్రదర్శించే అవకాశం కల్పిస్తున్నారు. ఉత్తమ ఆవిష్కర్తలకు తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ ద్వారా సర్టిఫికెట్, జ్ఞాపిక, ఇన్నోవేషన్ పేటెంట్ హక్కులు, ప్రశంసాపత్రం అందజేస్తారు. అన్ని పాఠశాలల నుంచి ఆవిష్కరణలు పంపించేలా ప్రధానోపాధ్యాయులు చొరవ చూపాలని రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది.

దరఖాస్తు చేయండిలా..

తమ ఆలోచనలకు అనుగుణంగా తయారు చేసిన ప్రాజెక్టు విషయాలను దరఖాస్తు చేసుకునేందుకు ఆగస్టు 5వ తేదీ వరకు అవకాశం ఉంది. ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమంలో పాల్గొనడానికి జ్ఞిజఓ/ᰀᰁటఽజీఛి.ౌటజ వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 25వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి. వినూత్న ఆలోచనలతో ఆవిష్కరణలు రూపొందించే ముందు దానికి సంబంధించి ఆరు వాక్యాలతో కూడిన ఆవిష్కరణ వివరణ, రెండు నిమిషాలు నిడివి కలిగిన వీడియో, ఆవిష్కరణకు సంబంధించి నాలుగు ఫొటోలు, ఆవిష్కర్త పేరు, వయసు, మొబైల్ నంబర్, ప్రస్తుత వృత్తి, పూర్తి వివరాలు, చిరునామాతో సహా 91006 78543 నంబర్‌కు వాట్సాప్ ద్వారా పంపించవచ్చు. వచ్చిన ఆవిష్కరణల నుంచి ఐదు ఉత్తమ ఆవిష్కరణలను ఎంపిక చేసి ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసే స్టాల్స్‌లో ప్రదర్శిస్తారు.

సృజనకు పదును..



ప్రతీవ్యక్తిలో దాగిఉన్న ఆలోచనలను వెలికి తీసి వాటిని ఆవిష్కరణలుగా మార్చి సమాజంలోని సమస్యలకు పరిష్కారం చూపడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమం చేపట్టింది. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్, పాఠశాలల, కళాశాలల విద్యార్థులు, తల్లిదండ్రులు గృహిణులు, రైతులు, వివిధరంగాల్లో పనిచేస్తున్న వారు ఎవరైనా పాల్గొనవచ్చు. ఆగస్టు 5వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. జిల్లాస్థాయి, రాష్ట్ర స్థాయిలో ఉత్తమమైన వాటిని ఎంపిక చేసి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేస్తారు.

– డాక్టర్ రవీందర్‌రెడ్డి, డీఈవో

క్లుప్తంగా

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల విడుదల

నిర్మల్‌రూరల్: ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ ఫలితాలను శుక్రవారం ప్రభుత్వం విడుదల చేసింది. ఫస్ట్ ఇయర్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో జిల్లా మూడో స్థానం, సెకండ్‌ఇయర్ ఫలితాల్లో రెండో స్థానంలో నిలిచింది. ఫస్ట్ ఇయర్‌లో 2,775 మంది పరీక్షలు రాయగా 1,997 మంది(71శాతం) ఉత్తీర్ణత సాధించారు. బాలురు 1,459 మందికిగాను 946 (64శాతం), బాలికలు 1316 మంది పరీక్షలు రాయగా 1051 (79శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. సెకండ్ ఇయర్‌లో 1526 మంది పరీక్షలు రాయగా 1,150 మంది(75శాతం) ఉత్తీర్ణత సాధించారు. బాలురు 986 మందికి గాను 730 మంది (74శాతం), బాలికలు 540 మందికి గాను 420 మంది (78శాతం) ఉత్తీర్ణత సాధించారు.

బోనమెత్తిన విద్యార్థులు



బోనాలతో విద్యార్థులు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని శ్రీ విద్యానికేతన్ పాఠశాలలో తెలంగాణ బోనాల పండుగను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు బోనాలు ఎత్తుకొని పురవీధుల గుండా ర్యాలీ తీశారు. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలను విద్యార్థులకు వివరించినట్లు ప్రిన్సిపాల్ శ్యాంప్రకాశ్ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

విత్తనశుద్ధి చేసుకోవాలి

సోన్: విత్తనశుద్ధితో తెగుళ్ల బెడద, కలుపు తీసేందుకు కూలీల ఖర్చు తగ్గుతుందని ఏఈవో అంబాజీ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ముత్తన్నకు చెందిన చేనులో కంది విత్తనాలకు విత్తనశుద్ధి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెగుళ్లు సోకాక పంటపై మందులు పిచికారీ చేసే కంటే ముందే విత్తన శుద్ధి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

నోట్‌బుక్‌లు పంపిణీ



నోట్‌బుక్‌లు అందిస్తున్న సంస్థ సభ్యులు

లక్ష్మణచాంద: మండలంలోని కనకాపూర్ ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం వరల్డ్ వి జ న్ అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్‌బుక్‌లు పంపిణీ చేశారు. సంస్థ ఆధ్వర్యంలో 91 మందికి రూ.10వేల విలువైన నోట్‌బుక్‌లను అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. ఇందులో సంస్థ సభ్యులు కరుణ్, ఉపాధ్యాయురాలు భారతి, సీఆర్పీ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సరుకులు అందజేత

లోకేశ్వరం: మండలంలోని హథ్‌గాం పంచాయతీ పరిధిలోని గాంధీనగర్ తండావాసులకు శుక్రవారం మా అమ్మనాన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో చైర్మన్ ఆంజనేయులు నిత్యావసర సరుకులు అందించారు. వివిధ గ్రామాల దాతల సహకారంతో రూ.4 వేల విలువైన సరుకులు అందించినట్లు పేర్కొన్నారు. సుమిద్‌కుమార్, శ్రీరాములు ఉన్నారు.

ఎస్సారెస్పీ సందర్శన

లక్ష్మణచాంద: ఉత్తర తెలంగాణ వరప్రదాయిని శ్రీరాంసాగర్ ప్రాజెక్టును మండల నాయకులు శుక్రవారం సందర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి రివర్స్ పంపింగ్ ద్వారా ఎస్సారెస్పీకి కాళేశ్వరం నీటిని తరలిస్తున్నారు. దీంతో మండలానికి చెందిన డీసీసీబీ వైస్ చైర్మన్ ఎర్ర రఘునందన్‌రెడ్డి, జెడ్పీటీసీ రాజేశ్వర్, బీఆర్‌ఎస్ జిల్లా కారదర్శి అడ్వాల రమేశ్, అల్లోల సురేందర్‌రెడ్డి తదితరులు నిజామాబాద్ జిల్లాలోని ఎస్సారెస్పీ వద్దకు వెళ్లారు. ప్రాజెక్టులో నీటిమట్టం, రివర్స్ పంపింగ్ ద్వారా వస్తున్న కాళేశ్వరం జలాలను పరిశీలించారు. నరేశ్‌రెడ్డి, కేశం రమేశ్, సురేశ్, లింగారెడ్డి, జహీరొద్దీన్, అర్జున్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గాంధీభవన్‌లో ఫిర్యాదు



కొప్పుల రాజుతో జెడ్పీటీసీ చారులత

కడెం: ఖానాపూర్ నియోజవర్గంలో నెలకొన్న పలు సమస్యలపై ఉట్నూర్ జెడ్పీటీసీ రాథోడ్ చారులత శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో కాంగ్రెస్ నాయకులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎస్టీ విభాగం జాతీయ కోఆర్డినేటర్ కొప్పుల రాజును కలిసి పలు అంశాలు వివరించారు. ఇటీవల నియమించిన మండల, పట్టణాధ్యక్షుల అవకతవల గురించి వారి దృష్టికి తీసుకెళ్లారు. క్షేత్రస్థాయిలో నాయకుల పనితీరు గుర్తించి.. వచ్చే ఎన్నికల్లో వారికే టికెట్లు కేటాయించాలని కోరినట్లు ఆమె తెలిపారు.

భూములిచ్చి అభివృద్ధికి దూరంగా..!

- ఎస్సారెస్పీ పునరావాస గ్రామాల్లో సౌకర్యాలు కరువు
- పట్టించుకోని అధికారులు, పాలకులు
- సమస్యలతో సహవాసం చేస్తున్న ప్రజలు



అధికారులు మధ్యలో వదిలేసిన పాఠశాల భవనం



రాయపూర్‌కాండ్లీ గ్రామం

లోకేశ్వరం: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిర్మాణంలో తమ పంట భూములను కోల్పోయిన రైతులు నాలుగు దశాబ్దాలుగా అభివృద్ధికి దూరంగా బతుకుతున్నారు. 1978లో లోకేశ్వరం మండలంలోని ఎస్సారెస్పీ ముంపు గ్రామాల్లోని ప్రజలను ప్రభుత్వం ఖాళీ చేయించింది. వారికి పునరావాసం మరోచోట కల్పించింది.. కానీ అక్కడ మౌలిక వసతులు ఏర్పాటు చేయలేదు. దీంతో నాలుగు దశాబ్దాలుగా కనీస వసతుల్లేక ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు, పాలకులు సైతం సదరు గ్రామాల వైపు కన్నెత్తి చూడడం లేదు.

అందని పూర్తి పరిహారం..

లోకేశ్వరం మండలంలో 19 గ్రామాలతోపాటు నర్సాపూర్ (జి)లో ఒకటి, దిలావర్‌పూర్‌లో ఏడు, ముథోల్‌లో ఒకటి, బాసరలో ఆరు గ్రామాలు ఎస్సారెస్పీలో ముంపునకు గురయ్యాయి. అప్పట్లో వ్యవసాయ భూములు కోల్పోయిన రైతులకు ఎకరాకు రూ.600 నుంచి రూ.800 వరకు మాత్రమే పరిహారం చెల్లించారు. ఇళ్లకు కూడా నామమాత్రంగానే పరిహారం ఇచ్చి చేతులు దులుపుకొన్నారు. మరింత పరిహారం కావాలని నిర్వాసితులు ఉద్యమించినా ఎవరూ పట్టించుకోలేదు. ప్రభుత్వం రాళ్లు రప్పలున్న భూములిచ్చినా.. సాగు యోగ్యంగా అభివృద్ధి చేయలేదు.

లోకేశ్వరం మండలంలో అభివృద్ధి అంతంతే..

లోకేశ్వరం మండలంలోని పంచగుడి, గడ్‌చంద, పిప్రి, కన్కపూర్, అబ్దుల్లాపూర్, అర్లి, గొడిసెరా, రాయపూర్‌కాండ్లీ, రాజూరా, మన్మద్, పోట్‌పల్లి, ఏడ్దూర్, జోహర్‌పూర్, వాట్టోలి, సాథ్‌గాం, హద్దిగాం, సుర్లి, మొహాళ, అవర్గ గ్రామాలు ఎస్సారెస్పీ ప్రాజెక్టు కింద ముంపునకు గురయ్యాయి. ఆయా గ్రామాల ప్రజలకు మరోచోట పునరావాసం కల్పించారు.. కానీ అక్కడ వసతులు ఏర్పాటు చేయలేదు. ఇప్పటికీ చాలా గ్రామాల్లో పంచాయతీలకు సొంత భవనాలు లేవు. ఆలయాల నిర్మాణాలు అర్ధంతరంగా నిలిచిపోయాయి. సాథ్‌గాం, హద్దిగాం, మన్మద్ గ్రామాలకు సుద్దవాగు ప్రవాహం వస్తుండటంతో భూములు ముంపునకు గురవుతున్నాయి. కానీ వారు పరిహారానికి నోచుకోవడం లేదు. మిగతా మండలాల్లోనూ ఇదే దుస్థితి నెలకొంది.

నాసిరకం పనులు..

మండలంలోని పునరావాస గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపించింది. కొన్ని గ్రామాల్లో అంతర్గత రోడ్లు, మురుగు కాలువల నిర్మాణాలు కనుమరుగయ్యాయి. గ్రామాలు ముంపునకు గురై దశాబ్దాలు గడిచిన రోడ్లు లేవు. మండల కేంద్రానికి వెళ్లే అర్లి ఎక్స్‌రోడ్డు వంతెన శిథిలావస్థకు చేరింది. ఎప్పుడు కూలుతుందోనని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. హవర్గ, అర్లి, గొడిసెరా రోడ్లు అధ్వానంగా మారాయి.

గోస పడుతున్నాం..



ఎస్సారెస్పీ పునరావాస గ్రామాలకు నిధులు మంజూరు చేసి అభివృద్ధి పనులు చేపట్టాలి. కనీస వసతుల్లేక గోస పడుతున్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో రోడ్లు, మురుగు కాలువలు నిర్మించాలి.

– మగ్గిడి భోజారెడ్డి, పంచగుడి

పూర్తి పరిహారం చెల్లించాలి



భూములు, ఇళ్లు కోల్పోయిన వారికి పూర్తి పరి హారం ఇవ్వలేదు. విలువైన భూములు కోల్పోయాం. అధికారులు, పాలకులు స్పందించి పూర్తి పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలి.

– పెద్దకాపు రాములు, నర్సాపూర్ (జి)

ఉన్నతాధికారులకు నివేదిస్తాం

జిల్లాలోని ఎస్సారెస్పీ పునరావాస గ్రామాల్లో సౌకర్యాలు, అభివృద్ధి గురించి ఉన్నతాధికారులకు నివేదిస్తాం. రోడ్లు, అర్లి వంతెనతోపాటు గ్రామాల్లో సీసీ రోడ్లు దెబ్బతిన్నాయి. నిధులు మంజూరు కాగానే మరమ్మతులు చేయిస్తాం.

– చక్రపాణి, ఎస్సారెస్పీ ఈఈ

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాకేంద్రంలోని దివ్యనగర్, విశ్వనాథ్‌పేట్ సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతుల నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ రవి ఒక ప్రకటనలో తెలిపారు. దివ్యనగర్, ఏఎన్‌రెడ్డి కాలనీ, శ్రీనగర్‌కాలనీ, శాంతినగర్, శాస్త్రీనగర్, దత్తాత్రేయనగర్, గాజులపేట్, బంగల్‌పేట్, విశ్వనాథ్‌పేట్, వైఎస్సార్ కాలనీ, డాక్టర్స్‌లైన్, కబూతర్ కమాన్, బుధవార్‌పేట్, నా యుడువాడ, గాంధీనగర్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 12.30 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని.. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

లక్ష్మణచాంద: సాధారణ మరమ్మతుల్లో భాగంగా మండలంలోని వడ్యాల్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రా మాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ మహేశ్ ఓ ప్రకటనలో తెలిపారు.

సాయంత్రం రెండు గంటలు..

లోకేశ్వరం: మరమ్మతుల కారణంగా మండలంలోని పిప్రి సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శనివారం సాయంత్రం 4 నుంచి ఆరు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఏఈ శివకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఖానాపూర్: పట్టణంలోని సబ్‌స్టేషన్‌లో 33కేవీ లైన్ మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

అర్హులందరికీ పోడు పట్టాలు

- ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి



తానూరులో లబ్ధిదారులకు పోడు పట్టాలు అందిస్తున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి,అధికారులు

తానూరు: అర్హులందరికీ పోడు పట్టాలు అందిస్తున్నామని.. రైతులు భూములు అమ్ముకోకుండా సాగు చేసుకొని లబ్ధి పొందాలని ముథోల్ ఎమ్మెల్యే జి.విఠల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తానూరు రైతువేదికలో మండలంలోని ఝురి(బి)తండా ,ఝురి(బి), హిప్పెల్లితండా గ్రామాల్లోని 96 మందికి 192 ఎకరాలకు సంబంధించిన పోడు భూముల పట్టాలు అందించినట్లు పేర్కొన్నారు. మొగ్లి గ్రామంలో సమస్యలు పరిష్కరించి అర్హులకు పట్టాలు పంపిణీ చేస్తామన్నారు. వైస్ ఎంపీపీ చంద్రకాంత్, మాజీ ఎంపీపీ బాశెట్టి రాజన్న, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు పోతారెడ్డి, నారాయణ్‌రావ్ పటేల్, ఎంపీడీవో శ్రీనివాస్ ప్రజాప్రతినిధులు తదితరులు ఉన్నారు.

అటవీశాఖ అధికారులపై ఆగ్రహం

గ్రామస్తులకు తెలియకుండా పోడు భూముల గుర్తింపు సర్వే ఎలా చేశారని మొగ్లి, కోలూరు గ్రామాల రైతులు ఎఫ్‌ఎస్‌వో నందయ్య, అటవీశాఖ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కోలూరు పంచాయతీలో తీర్మానం చేయకుండానే లబ్ధిదారుల ఎంపిక జరిగిందని వాపోయారు.

కుంటాల: మండల కేంద్రంలోని రైతువేదికలో 105 మంది రైతులకు 350 ఎకరాలకు సంబంధించిన పోడు పట్టాలను ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పంపిణీ చేశారు. కుంటాలకు చెందిన రైతు సాంగి శంకర్ ఇటీవల మృతి చెందగా ఆయన భార్య సంగీతకు రూ.ఐదు లక్షల రైతుబీమా చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అప్క గజ్జారాంయాదవ్, జెడ్పీటీసీ కొత్తపల్లి గంగామణి బుచ్చన్న, సర్పంచ్ సమత, ప్రవీణ్‌కుమార్, గజ్జారాం, దత్తాత్రి, ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, ఏవో సోమలింగారెడ్డి, ఎస్సై హన్మండ్లు, ఎఫ్‌ఎస్‌వో రేష్మ తదితరులు పాల్గొన్నారు.

తాత, ముత్తాతల నుంచి పోడు భూములను సాగు చేస్తున్న తమకు న్యాయం చేయాలని కోరుతూ కుంటాలకు చెందిన 20 మంది నాయక్‌పోడ్ సంఘ సభ్యులు ఎమెల్యేకు విన్నవించారు. ఎమ్మెల్యే స్పందిస్తూ అర్హులకు పట్టాలు అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

కస్తూరిబాలో సమస్యలు పరిష్కరిస్తాం

తానూరు: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కస్తూరిబాలో విద్యార్థులకు నోట్‌బుక్‌ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. పాఠశాలలో 250 మంది చదువుతున్నారని సరిపడ మూత్రశా లలు, మరుగుదొడ్లు, తలుపులు, కిటికీలు లేక ఇబ్బంది పడుతున్నామని పలువురు ఉపాధ్యా యులు, విద్యార్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అలేఖ్య, మాజీ ఎంపీపీ బాశెట్టి రాజన్న, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పోతారెడ్డి, చంద్రకాంత్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

గిరిజనుల కల నెరవేర్చిన కేసీఆర్

- ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్



కడెం: పట్టాలు అందిస్తున్న ఎమ్మెల్యే రేఖానాయక్

పెంబి: ఏళ్లుగా ఎదురుచూస్తున్న గిరిజనులకు పట్టాలు అందించి సీఎం కేసీఆర్ వారి కల నెరవేర్చారని ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. శుక్రవారం పెంబి రైతువేదికలో పోడు పట్టాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని 1065 మందికి 5,141 ఎకరాల భూమికి సంబంధించిన పట్టాలు పంపిణీ చేశామన్నారు. ఎంపీపీ కవిత, జెడ్పీటీసీ జానుబాయి, సర్పంచ్‌లు, తహసీల్దార్ శ్రీధర్, ఎంపీడీవో సుధాకర్ తదితరులు ఉన్నారు.

కడెం: రైతులకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని కొండుకూర్ గ్రామంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో 750 మందికి పోడు భూముల పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎంపీవో ఉపేందర్, వైస్ ఎంపీపీ శ్యాంసుందర్, సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు వేణుగోపాల్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

మేదరి సంఘ సమావేశంలో..

ఖానాపూర్: మేదరి కులస్తుల సమస్యలు పరిష్కరిస్తామని పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. పట్టణంలోని శాంతినగర్‌లో మేదరి సంఘం సభ్యులు సమావేశం నిర్వహించారు. దీనికి హాజరైన ఎమ్మెల్యేను మేదరి సంఘ భవనం ఏర్పాటు చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చిలివేరి లక్ష్మీనర్సయ్య వినతిపత్రం అందజేశారు. అనంతరం మస్కాపూర్‌లో వర్షానికి కూలిన మజీద్ గోడ పరిశీలించి ఆదుకుంటామని భరోసానిచ్చారు. అంతకముందు రైస్‌మిల్లర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే దంపతులను సన్మానించారు. మదిరె గంగరాజం, శ్రీనివాస్, పెద్దులు, రాజేందర్, గంగనర్సు, లక్ష్మి, లత తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఖానాపూర్ సీఐ

ఖానాపూర్: ఖానాపూర్ నూతన ఇన్‌చార్జి సీఐ రవీందర్‌నాయక్ ఎమ్మెల్యే రేఖానాయక్‌ను పట్టణంలో మర్యాద పూర్వకంగా కలిశారు. అంతకుముందు ఖానాపూర్ సర్కిల్ కార్యాలయంలో ఇన్‌చార్జి సీఐగా రవీందర్‌నాయక్ బాధ్యతలు స్వీకరించారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి



అవగాహన కల్పిస్తున్న వైద్యురాలు వైష్ణవి

లక్ష్మణచాంద: పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి వైద్యురాలు వైష్ణవి పేర్కొన్నారు. శుక్రవారం డ్రై డే కార్యక్రమంలో భాగంగా మండలంలోని పీచర, ధర్మారం, పార్‌పెల్లి గ్రామాల్లో పర్యటించారు. పలు వీధుల్లో తిరుగుతూ ఇళ్ల వద్ద కుండీలు, వాటర్‌ట్యాంక్‌లు, పాతటైర్లు, కూలర్లలో ఉన్న నీటిని పారబోయించారు. నిత్యం తాజా ఆహారం, కాచి చల్లార్చిన నీటినే తీసుకోవాలన్నారు. వారి వెంట సిబ్బంది శివకృష్ణ, పంచాయతీ కార్యదర్శి సాయిప్రసాద్, ఆశావర్కర్లు తదితరులు ఉన్నారు.

లోకేశ్వరం: పరిసరాల్లో నీరు నిల్వకుండా చూసుకోవాలని ఎంపీడీవో సోలమాన్ రాజ్ అన్నారు. శుక్రవారం మండలంలోని హథ్‌గాం, సాథ్‌గాం, ధర్మోర, పంచగుడి, ధర్మోర, వట్టోలి గ్రామాల్లో డ్రైడే డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కార్యదర్శులు, సర్పంచ్‌లు ఉన్నారు.

పాడుపు అలవర్చుకోవాలి

కుంటాల: స్వయం సహాయక సంఘాల మహిళలు పొదుపు అలవర్చుకోవాలని ఏపీఎం భోజన్న పేర్కొన్నారు. శుక్రవారం కుంటాల శ్రీ రామకృష్ణ గ్రామాఖ్య సంఘ సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. మహిళా రైతులను ప్రోత్సహించేందుకు పాడి, వ్యవసాయ రుణాలు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సంఘం అధ్యక్షురాలు సుమాలిని కార్యదర్శి సునీత, శారద, వీవోఏ దేవన్న తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ మొక్కలు పంపిణీ

సారంగపూర్: హరితహారంలో భాగంగా మండలంలోని వంజర్ గ్రామంలో సర్పంచ్ లక్ష్మణ్ ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామస్తులకు మొక్కలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంట్లో మొక్కలు నాటి సంరక్షించుకోవాలని సూచించారు. శ్రీనివాస్‌రెడ్డి, మహేశ్‌యాదవ్, పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మి తదితరులు ఉన్నారు.

చెక్కు అందజేత

నర్సాపూర్(జి): మండలంలోని చాక్‌పల్లి పంచాయతీ పరిధిలోని బూర్గుపల్లి(కె) గ్రామానికి చెందిన సూర్యకాంతారావుకు రూ.లక్షా యాభై వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కు మంజూరైంది. శుక్రవారం బాధితుడికి బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షుడు కల్యాణ్ ప్రవీణ్‌కుమార్ అందజేశారు. మక్బూల్, లక్ష్మణ్, సురేశ్, రవి, మారుతి పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు



జెండా ఆవిష్కరణలో పాల్గొన్న నాయకులు

ఖానాపూర్: పట్టణంలోని అంబేద్కర్‌నగర్ కాలనీలో శుక్రవారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ శనిగారపు కమలాకర్, జిల్లా నాయకులు మునుగూరి ప్రణీత్ మాట్లాడారు. సమాజంలో అణగారిన వర్గాల గొంతుకగా ఎమ్మార్పీఎస్ ఎన్నో పోరాటాలు చేసిందన్నారు. అనంతరం ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గొర్రె గంగాధర్, జన్నారపు శంకర్, బిక్కి రాజన్న, మునుగూరి భూమన్న, గంగారాం, ప్రవీణ్, నరేందర్, వెంకటేశ్, అనిల్, రాకేశ్, కల్యాణ్, ఆనంద్, తదితరులున్నారు.

గోరింటాకు పండుగ

ముథోల్: ఆషాఢమాసం నేపథ్యంలో మండల కేంద్రంలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్‌లో శుక్రవారం గోరింటాకు పండుగ నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయులు సారథి రాజు తెలిపారు. ఈ సందర్భంగా గోరింటాకుతో కలిగే లాభాలను వివరించారు. విద్యార్థులు ఉత్సాహంతో పాల్గొన్నారు.

వెంచర్‌పై ఆరోపణలు, ప్రత్యారోపణలు..!

- సామాజిక మాధ్యమంలో పోస్టులు

భైంసాటౌన్: పట్టణంలోని ఖత్‌గాం మార్గంలో ఓ వెంచర్ అనధికారికంగా ఏర్పాటు చేయడమే కాకుండా, అందులో అక్రమంగా భవన నిర్మాణాలు చేపడుతున్నారంటూ బీజేపీ పట్టణ మాజీ అధ్యక్షులు, ఏడో వార్డు కౌన్సిలర్ భర్త బాలాజీ సూత్రావే కొంతకాలంగా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతున్నారు. తాజాగా గురువారం సైతం పోస్టులు చేయడంతో, స్పందించిన భవన యజమానులు.. బాలాజీ సూత్రావే పార్టీని అడ్డం పెట్టుకుని అక్రమ నిర్మాణాలు అనే సాకుతో తమ నుంచి డబ్బులు డిమాండ్ చేశారని, గతంలోనూ డబ్బులు ఇచ్చామని ఆరోపిస్తూ ఓ వీడియోను సామాజిక మాధ్యమంలో పోస్టు చేశారు.

దీనికి స్పందించిన బాలాజీ సూత్రావే, తనపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని తాను డబ్బులు తీసుకోలేదంటూ శుక్రవారం స్థానిక మైసమ్మ ఆలయంలో ప్రమాణం చేశారు. అంతేగాక ఆరోపణలు నిరూపించాలని సవాల్ విసిరారు.

న్యూవెల్మల్ దర్గాలో ప్రార్థనలు



ప్రార్థనలు చేస్తున్న భక్తులు

సోన్: మండలంలోని న్యూవెల్మల్ గ్రామంలో శుక్రవారం సయ్యద్ హుస్సేన్ దర్గా వద్ద వీడీసీ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మహ్మద్ సయ్యద్ సాజిద్ అలియాస్ పెద్దబాపు ఇంటి నుంచి డప్పుచప్పుళ్ల నడుమ ఊరేగింపుగా వెళ్లి శివారులో ఉన్న దర్గా వద్ద హిందువులు, ముస్లింలు ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాలు కురిసి పంటలు పండాలని మొక్కుకున్నట్లు తెలిపారు. అనంతరం ఊరి బయట వన భోజనాలు చేసి సంతోషంగా గడిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నాగయ్య, వీడీసీ అధ్యక్షులు రెమ్మాయి సాగర్, కోశాధికారి కొండ రవి, మల్లయ్య, సలీం,హైమద్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

గోదావరికి ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

భైంసా: బాసరలోని గోదావరి నది వద్ద వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. నదిలో తెప్పలు విడిచి గంగమ్మకు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవాలని, పాడిపంటలతో సంతోషం చేకూరాలని గంగమ్మకు మొక్కుకున్నారు. పలువురు కుటుంబంతో వచ్చి సందడిగా గడిపారు.

సంక్షిప్త వార్తలు

పండ్లు, బిస్కెట్లు పంపిణీ

భైంసారూరల్: సర్కారు బడులకు తమ వంతు చేయూతనిస్తామని లయన్స్ క్లబ్ నిజామాబాద్ జోన్ చైర్మన్ సోలంకి శేషారావుపటేల్ అన్నారు. శుక్రవారం మండలంలోని వాలేగాం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 75 మంది విద్యార్థులకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ భైంసా అధ్యక్షులు అరవింద్, కార్యదర్శి నవనీత్ పటేల్, ఉపాధ్యాయులు విద్యార్థులు ఉన్నారు.

ఇంకుడు గుంతల పరిశీలన

లక్ష్మణచాంద: మండలంలోని పొట్టపెల్లి(కే) గ్రామంలో పంచాయతి కార్యాలయ సమీపంలో ఏర్పాటు చేసిన ఇంకుడుగుంతను శుక్రవారం ఎంపీడీవో శేఖర్ పరిశీలించారు. అనంతరం నర్సరీని పరిశీలించి పలు సూచనలు చేశారు. హరితహారంలో నాటే మొక్కల కోసం గుంతల తవ్వకం ఉపాధి కూలీలతో పూర్తి చేయించాలని ఎఫ్ఏ శ్రీనివాస్‌కు సూచించారు. ఇంటింటికీ మొక్కలు అందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఎఫ్ఏ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

'వచ్చే ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలి'

లోకేశ్వరం: వచ్చే ఎన్నికల్లో అవినీతిమయమైన కేసీఆర్ కుటుంబానికి బుద్ధి చెప్పి.. బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మోహన్‌రావు పటేల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పల్లెపల్లెకు బీజేపీ గడప గడపకూ మోహన్‌రావు పటేల్ కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా బీజేపీ జెండా ఆవిష్కరించారు. అనంతరం లక్ష్మీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సుభాశ్ పటేల్, సుమన్‌కుమార్, పో తన్న, శ్రీనివాస్, పాల గంగాధర్, నరహరి, అనిల్, భూమన్న పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

కడెం: ఆజాదీకా అమృత్ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలంలోని అంబారిపేట్ గ్రామంలో ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ లావాదేవీలపై అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ బ్యాంకింగ్‌పై అవగాహన పెంచుకోవాలని ఐకేపీ ఏపీఎం రాజారాం అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కొప్పుల లక్ష్మీ, సీసీ జ్యోతి, సీఎస్పీ మౌనిక, లింగన్న, వేణు, కవిత, సభ్యులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ముథోల్: తమ సమస్యలు పరిష్కరించి సకాలంలో వేతనాలు మంజూరు చేయాలని కోరుతూ శుక్రవారం పంచాయతీ కార్మికులు ఎంపీడీవో సురేశ్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర వ్యాప్త నిరసనలో భాగంగా తాము సమ్మెలో పాల్గొంటున్నట్లు మండలంలోని పంచాయతీ కార్మికులు పేర్కొన్నారు.

సమ్మెకు మద్దతుగా బైఠాయింపు..

ఖానాపూర్: పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు నారపాక నర్సయ్య అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం ముందు కార్మికులు రెండోరోజు చేపట్టిన నిరవధిక సమ్మెకు వారు మద్దతుగా బైఠాయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కారోబార్, బిల్ కలెక్టర్‌కు ప్రత్యేక హోదా కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి తొడసం శంభు, నాగరాజు, రవి, పోశెట్టి, శేఖర్, లక్ష్మణ్ రాములు తదితరులు ఉన్నారు.